
# సీఎం కేసీఆరే ప్రజలకు అండ

- కాంగ్రెస్, బీజేపీని నమ్మితే మోసపోతం..
- ఆదిలాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి జోగు రామన్న
- 400 మంది బీఆర్ఎస్‌లో చేరిక



ఎదులాపురం: పార్టీలో చేరిన వారికి గులాబీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే జోగు రామన్న

ఎదులాపురం, నవంబర్ 20: సీఎం కేసీఆరే తెలంగాణ ప్రజలకు అండగా ఉండగలరని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్న అన్నారు. ఆదిలాబాద్ ఏసీ మెకానిక్ యూనియన్ సభ్యులు, పాన్ షాప్ అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యే జోగు రామన్న నాయకత్వానికి జై కొట్టారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన చేరికల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు పార్టీలో చేరిన 400 మందికి గులాబీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగు రామన్న మాట్లాడుతూ.. బీజేపీలు ప్రజలపై భారం మోపే పార్టీ బీఆర్ఎస్ కాదని, పేద బడుగు బలహీన వర్గాలకు అండగా ఉండే కారు గుర్తు పార్టీ అని పేర్కొన్నారు. ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి, తనను మరోసారి గెలిపించాలని కోరారు. మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజానీ, పట్టణ కార్యదర్శి అష్రఫ్, సీనియర్ నాయకుడు యూనిస్ అక్బానీ, కో ఆప్షన్ సభ్యుడు ఏజాజ్, తదితరులున్నారు.

### ప్రతిపక్షాల డిపాజిట్ గల్లంతు..

రానున్న ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీల డిపాజిట్ గల్లంతవుతుందని బీఆర్ఎస్ మహిళా విభాగం పట్టణాధ్యక్షురాలు స్వరూపారాణి అన్నారు. ప్రచారంలో భాగంగా సోమవారం జిల్లా కేంద్రంలోని వార్డు నంబర్ 28 కోలిపుర, బొక్కలగూడలో బీఆర్ఎస్ వార్డు ఇన్‌చార్జి, వార్డు కౌన్సిలర్ పండ్ల శ్రీనివాస్‌తో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటేసి, ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్నను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి బొడగం మమత, పట్టణ కార్యదర్శి కరుణ, కార్యకర్తలు సంగీత, సురేఖ, గంగామణి, అంజలీ, లక్ష్మి, జ్యోతి, శోభ తదితరులున్నారు.

### మరింత అభివృద్ధికి సహకరించండి

ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్నను భారీ మెజార్టీతో గెలిపించి మరింత అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. ప్రచారంలో భాగంగా సోమవారం జిల్లా కేంద్రంలోని కుమ్మర్‌పేట్, మోచిగల్లీలో వార్డు ఇన్‌చార్జి యూనిస్ అక్బానీతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రజల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ విడుదల చేసిన మ్యానిఫెస్టోను ఇంటింటికీ తిరుగుతూ వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆసరా పింఛన్, కేసీఆర్ బీమా పథకం, పెట్టుబడి సాయం పెంపు, తదితర పథకాలపై వివరించారు. వచ్చే ఎన్నికల్లో ఆదిలాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థిగా జోగు రామన్నను ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మాజీ వార్డు కౌన్సిలర్ ఏ.శ్రీదేవి, ఐసీడీఎస్ మాజీ ఆర్గనైజర్ కస్తాల ప్రేమల, నాయకులు సృజన్, ప్రకాశ్, ఫిరోజ్, సలీం తదితరులున్నారు.

### కాంగ్రెస్, బీజేపీలవి మోసపూరిత మాటలు


జైనథ్, నవంబర్ 20: కాంగ్రెస్, బీజేపీ మోసపూరిత మాటలు చెబుతున్నాయని, నమ్మితే ఆగం చేస్తారని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బేల మండలంలో ఎమ్మెల్యే జోగు రామన్న విస్తృత పర్యటన చేశారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలిశారు. మొదట గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే జోగు రామన్నకు మంగళహారతులతో స్వాగతం పలికి డప్పు చప్పుళ్ల మధ్య ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే జోగు రామన్న మాట్లాడుతూ ప్రజానీకానికి ఎలాంటి సంక్షేమం అందించకుండా 72 ఏళ్లు పాలించిన బీజేపీ, కాంగ్రెస్ ఏ ముఖం పెట్టుకొని గ్రామాల్లో ఓట్లు అడగడానికి వస్తారని ఎమ్మెల్యే జోగు రామన్న ధ్వజమెత్తారు. బేల మండలాభివృద్ధిలో భాగంగా ఆదిలాబాద్ పట్టణం నుంచి బేల వరకు రూ.వేల కోట్లు వెచ్చించి రోడ్డు అభివృద్ధి చేయడం జరిగిందని, నాడు నానా అవస్థలు ఎదుర్కొన్న ప్రయాణికులు నేడు సులభతరంగా ప్రయాణాన్ని చేసుకోగలుగుతున్నారన్నారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు రైతుల పట్ల అమానుషంగా ప్రవర్తించారన్నారు. మూడోసారి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను గెలిపించుకొని ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్నను బలపర్చాలని కోరారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ రౌతు మనోహర్, బేల మండలాధ్యక్షుడు ప్రమోద్ రెడ్డి, సతీశ్ పవార్, గంభీర్ ఠాక్రే, విపిన్, తన్వీర్ ఖాన్, సునీల్, ఇంద్రశేఖర్ పాల్గొన్నారు.

### బీఆర్ఎస్‌లో పలువురి చేరిక..

జైనథ్, నవంబర్ 20: బీజేపీ చేస్తున్న మోసాలను యువకులు గ్రహిస్తున్నారని, గ్రూప్-1, గ్రూప్-2 పేపర్ లీకేజీలో బీజేపీ నాయకులు ఫొటోలతో సహా దొరికిపోయారని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. సోమవారం జైనథ్, బేల మండలాల్లోని జామిని, కారా గ్రామాలకు చెందిన యువకులు పెద్ద ఎత్తున బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే జోగు రామన్న కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

### రూ.400 వంట గ్యాస్

ఎదులాపురం,నవంబర్ 20: జిల్లా కేంద్రంలోని రవీందర్‌నగర్, హౌసింగ్‌బోర్డ్, గాంధీనగర్‌లో సోమవారం బీఆర్ఎస్ పార్టీ మహిళా కార్యకర్తలు ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేపట్టారు. ప్రభుత్వ పథకాలు అమలు గురించి తెలియజేస్తూ రేషన్ షాపుల్లో సన్నబియ్యం, రూ.5లక్ష బీమా, రూ.6వేలు దివ్యాంగులకు, రూ.5వేలు వృద్ధాప్య పింఛన్ ఇవ్వడంతో పాటు సౌభాగ్యలక్ష్మి పథకం కింద రూ.3వేలు ఇవ్వడం జరుగుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ కారు గుర్తు ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్నకు ఓటేసి గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ దేశెట్టి ప్రభావతి, జోగు రమణి, ఫ్లోర్ లీడర్ బండారి సతీశ్, మహిళా నాయకురాళ్లు బండారి అనూష, అత్యం ఆశమ్మ, కొప్పుల రాణి, అబ్బిడి సరిత, జల్లెల జీవిత, లావణ్య, స్వప్న, సంధ్య, సుధా, విమల కాలనీవాసులు ఉన్నారు.



ప్రచారంలో మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, యూనిస్



ఎదులాపురం: ప్రచారంలో పాల్గొన్న మహిళలు



ప్రచారంలో పాల్గొన్న పట్టణాధ్యక్షురాలు స్వరూపారాణి

# కాంగ్రెస్, బీజేపీవి చిల్లర రాజకీయాలు

- డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి

ఎదులాపురం, నవంబర్ 20: ఓటమి భయంతోనే ప్రతిపక్ష పార్టీల నేతలు దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నారని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి పాయల్ శంకర్‌ను మూడు సార్లు ప్రజలు ఓడించారని గుర్తుచేశారు. అలాంటి పాయల్ మరోసారి అవకాశం ఇవ్వాలని ప్రజల ముందుకు రావడం సిగ్గుచేటన్నారు. పెద్ద భూ కబ్జాదారైన పాయల్ శంకర్‌ను ప్రజలు నమ్మరని , సొంత గ్రామం అడలో కూడా ఆయనపై విశ్వాసం లేదని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్నను జైనథ్ మండలం ఆడ గ్రామంలో బీజేపీ నాయకులు అడ్డుకోవడం సరికాదన్నారు. అదే విధంగా జైనథ్ మండలంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థులను ఎక్కడ కూడా బీఆర్ఎస్ నాయకులు అడ్డుకోలేదన్నారు. కానీ వారే బీఆర్ఎస్ గెలుపు తథ్యమని జీర్ణించుకోలేక ఇలా అడ్డుకోవడం ప్రజలు గమనిస్తున్నారని డీసీసీబీ చైర్మన్ గుర్తుచేశారు. కాంగ్రెస్ అభ్యర్థి కంది శ్రీనివాస్‌రెడ్డి ఇచ్చిన ప్యాకేజీకి బాలూరి గోవర్ధన్ రెడ్డి అమ్ముడుపోయాడని మండిపడ్డారు. ఎమ్మెల్యే జోగురామన్న చలవతోనే బాలూరి డైరెక్టర్ అయ్యారన్నది గుర్తు చేసుకోవాలన్నారు. బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి బి. గంగారెడ్డి , పీఏసీఎస్ డైరెక్టర్ ఏనుగు అశోక్ రెడ్డి, నాయకులు సాజిదుద్దీన్,విజయ్ ఉన్నారు.

## పండరీపూర్‌కు పాదయాత్ర



పండరీపూర్‌కు వెళ్తున్న భక్తులు

ఇంద్రవెల్లి, నవంబర్ 20: ఆసిఫాబాద్ నుంచి ప్రారంభమైన పండరీపూర్ పాదయాత్ర సోమవారం ఇంద్రవెల్లి మండల కేంద్రానికి చేరుకుంది. మండలకేంద్రంలోని భక్తుల ఆధ్వర్యంలో వారికి ఘన స్వాగతం పలికారు. అనంతరం పాల్కితో మండలకేంద్రంలో భారీ శోభాయాత్ర నిర్వహించారు. భక్తి పాటలపై మహిళలు, యువతీయువకులు వేర్వేరుగా ఆడిపాడారు. స్థానిక రాధాకృష్ణ మందిరంలో కాసేపు విశ్రాంతి తీసుకున్నారు. అనంతరం ఇక్కడి నుంచి బయల్దేరి వెళ్లారు. నాయకులు ఆడే తుకారాం మహారాజ్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## కళాజాత



ప్రదర్శన నిస్తున్న కళాకారులు

ఇంద్రవెల్లి, నవంబర్ 20: మండలకేంద్రంలో ఖానాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్యా జాన్సన్‌నాయక్ తరపున నిర్వహించిన కళాజాత ప్రజలను ఆకట్టుకున్నది. మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌక్‌లో సోమవారం కళాకారులు నిర్వహించిన కళాజాతతో బీఆర్ఎస్ పార్టీ అభివృద్ధి కార్యక్రమాలతోపాటు సంక్షేమ పథకాలను వివరించారు. పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ బీఆర్ఎస్ పార్టీ, రాష్ట్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలపై ఆడిపాడారు. ఖానాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్యా జాన్సన్‌నాయక్ కారుగుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

## కుమ్రం భీం విగ్రహావిష్కరణ

ఆదిలాబాద్ రూరల్, నవంబర్ 20: ఆదిలాబాద్ రూరల్ మండలంలోని యాపల్‌గూడ గ్రామంలో కుమ్రం భీం వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివాసులు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీ జెండా ఎగురవేశారు. అనంతరం కుమ్రం భీం విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం భీం విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జల్, జంగల్, జమీన్ కోసం పోరాడిన కుమ్రం భీం ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షుడు గణేశ్ పిలుపునిచ్చారు.

## అంత్యక్రియలకు సహకారం

ఆదిలాబాద్ రూరల్, నవంబర్ 20: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఖానాపూర్ కాలనీకి చెందిన దుబ్బాక లక్ష్మి(50) అనారోగ్యంతో రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందింది. పేదరికం కారణంగా అంత్యక్రియలు నిర్వహించడానికి ఆమె కుమారులు బెస్ట్ ఫ్రెండ్స్ హెల్ప్ వెల్ఫేర్ సొసైటీ వారి సహాయం కావాలని కోరారు. సొసైటీ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ వెంటనే ముందుకు వచ్చి దహన సంస్కారాలకు అన్ని ఏర్పాట్లు చేశారు. తిర్పెల్లి శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. బాధితురాలి కుమారులు, ఆమె బంధువులు అబ్దుల్ అజీజ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## బలగాల కవాతు

ఇంద్రవెల్లి, నవంబర్ 20: ఉట్నూర్ సీఐ రామకృష్ణ, ఇంద్రవెల్లి ఎస్ఐ డీ సునీల్ ఆధ్వర్యంలో ప్రత్యేక బలగాలతో మండలకేంద్రంలో సోమవారం కవాతు నిర్వహించారు. కమాండెంట్లు కమలేశ్, మేనోన్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.